# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త




## వివాదాల సుడిలో

# శ్రీ చెంగాళమ్మ ట్రస్టుబోర్డు

### కమిటి నియామకానికి అన్నీ అడ్డంకులే



సూళ్లూరుపేట, ఆగస్టు 19 ప్రభాతవార్త

తెలుగు, తమిళ భక్తుల ఆరాధ్య దైవమైన శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానం ట్రస్టుబోర్డు నియామకం వివాదాల సుడిలో చిక్కుకుని ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు పూర్తయినప్పటికీ ట్రస్టుబోర్డు నియామకంలో అన్నీ అడ్డంకులే ఎదురవుతున్నాయి. ట్రస్టుబోర్డు ఛైర్మన్‌గా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలని పార్టీ భావించి అందుకు తగ్గట్టుగా ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. అక్కడ నుంచి వివాదం మొదలైంది. 2010, 2016లో ట్రస్టు బోర్డు నియామకాలకు అడ్డంకులు కల్పించిన అర్వభూమి చంద్రశేఖర్‌రెడ్డి మళ్లీ రంగంలోకి వచ్చారు. వంశపారంపర్య ధర్మకర్త పదవి ఇవ్వాలంటూ ఆయన ప్రస్తుతం కోర్టును ఆశ్రయించారు. దీంతో చెంగాళమ్మ ట్రస్టుబోర్డు నియామకానికి బ్రేక్ పడింది. ఈ నేపథ్యంలో అర్వభూమి చంద్రశేఖర్‌రెడ్డిపై వేలూరు వెంకటయ్య ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు పోలీసులు నమోదు చేశారు. దీనిపై విచారణ కొనసాగిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత తిరుమూరు సుధాకర్‌రెడ్డికి ట్రస్టు బోర్డు ఛైర్మన్‌గా అవకాశం ఇవ్వాలని స్థానిక పార్టీ నాయకత్వం భావించినప్పటి నుంచి అడుగడుగునా అవాంతరాలు ఎదురవుతున్నాయి. ముందుగా పార్టీలో 2024 ఎన్నికల వరకు కీలకభూమిక పోషించిన వేనాటి కుటుంబానికి ట్రస్టుబోర్డు ఛైర్మన్ పదవి ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ అధిష్టానానికి వినతి చేశారు. అలాగే 2024 ఎన్నికల వరకు వైసీపీలో ఉండి చెంగాళమ్మ ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్‌గా రెండుసార్లు పనిచేసిన దువ్వూరు బాలచంద్రారెడ్డికి తెలుగుదేశం పార్టీలో చేర్చుకుని ఛైర్మన్‌గా మరో అవకాశం కల్పించాలని పెద్దఎత్తున ప్రయత్నాలు జరిగాయి. కాగా, ఈ ప్రయత్నాలన్నింటికీ చెక్ పెడుతూ తిరుమూరు సుధాకర్‌రెడ్డికే ఛైర్మన్ పదవి కట్టబెట్టాలని సిఫార్సు చేసినప్పటికీ అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. అమ్మణ్ణి ఎవరిని తన సేవ చేసుకునే భాగ్యం కల్పిస్తుందే.. ఆమె ఆశీస్సులు ఎవరికి ఉన్నాయో వేచి చూడాల్సిందే.

## నేడు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సిఎంచే ప్రారంభం

రేణిగుంట, ఆగస్టు 19 ప్రభాతవార్త

రేణిగుంట ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ టెక్నాలజీస్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు బుధవారం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ను వర్చువల్ గా ప్రారంభించనున్నారు. ఈ హబ్ రావడం వల్ల ఎంతోమంది పారిశ్రామికవేత్తలను తయారు చేసే అవకాశం లభిస్తుంది. ఎంతోమంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే వెసులుబాటు చేకూరుతుంది. రతన్ టాటా ఇన్నోవేషన్ ఐటి హబ్ ప్రారంభంతో తిరుపతి (రేణిగుంట) పారిశ్రామిక వాడ మరో మైలురాయిని అధిగమించనుంది. ఏర్పాట్లను జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి, తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభురావు, అర్బన్ సీఐ జయచంద్ర, రూరల్ సీఐ మంజునాథ్ రెడ్డి, గాజులమండ్యం ఎస్సై సుధాకర్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పరిశ్రమల యాజమాన్యాలు పాల్గొన్నారు.

## మంగళం మార్గంలో చిరుతసంచారం




తిరుపతి, ఆగస్టు 19 ప్రభాతవార్త: తిరుపతి నగరశివార్లలో చిరుత పులులు సంచారం హడలెత్తిస్తోంది. ఇప్పటికే సోమవారం ఉదయం ఒక చిరుతపులిని తిరుపతి ఎస్వీయూనివర్సిటీ ప్రాంతంలో అటవీఅధికారులు బంధించగా మరో చిరుతపులి సోమవారం రాత్రి మంగళం మార్గంలోని ఓ మార్టువెనుక అటవీ ప్రాంతం సమీపంలో సంచరించింది. దీంతో ఆ పరిసరాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. చిరుతపులి సంచారం అటవీశాఖ సిసికెమెరాల్లో గుర్తించారు. ఆ ప్రాంత ప్రజలు చీకటిపడిన తరువాత ఒంటరిగా అడవివైపు వెళ్ళరాదని హెచ్చరించారు. అటవీఅధికారులు ఈ ప్రాంతంలో బోను ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.

# నిధులున్నా కనికరం లేదా!



### దోమల కాటుతో అల్లాడుతున్న జిల్లా ప్రజలు
### పట్టించుకోని మలేరియా విభాగం అధికారులు

**- నేడు ప్రపంచ దోమల నివారణ దినోత్సవం**

చిత్తూరు, ఆగస్టు 19 ప్రభాతవార్త:

క్షేత్ర స్థాయిలో దోమలను పూర్తి స్థాయిలో కట్టడి చేస్తే ఆరోగ్య సమాజ ఆవిష్కరణకు మార్గం సుగమం అవుతుంది. అయితే క్షేత్ర స్థాయిలో దోమలను కట్టడి చేయడానికి ప్రభుత్వం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలోని జిల్లా మలేరియా విభాగానికి లక్షలాది రూపాయలు నిధులు విడుదల చేస్తున్నప్పటికీ ఆ విభాగంలో విధులు నిర్వర్తించే అధికారులు ఈ నిధులను సక్రమంగా ఖర్చు చేయకపోవడంతో క్షేత్ర స్థాయిలో దోమల వద్ద డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా తదితర జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా బుధవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవంను జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో జరుగనుంది. జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో దోమలను కట్టడి చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాల్సి వుంటుంది. దీనికోసం ప్రభుత్వం ప్రత్యేకంగా జిల్లా మలేరియా విభాగానికి బడ్జెట్ కేటాయిస్తుంది. ఈ బడ్జెట్ నుండి జిల్లా మలేరియా అధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లు, అర్బన్ పిహెచ్‌సిలకు ఆయిల్ బాల్స్ కొనుగోలు చేయడం, మాలథిన్ స్ప్రేయింగ్ చేయడం, దోమల మందు స్ప్రేయింగ్ చేయడానికి స్ప్రేయర్లు కొనుగోలు చేసి ఇవ్వడం, అలాగే ప్రజల్లో దోమల పట్ల అవగాహన కల్పించి వారిని చైతన్యం కల్పించడానికి ర్యాలీలు, అవగాహన సమావేశాలు నిర్వహించడం, బ్యానర్లు, వాల్ పోస్టర్లు తదితరాల కొనుగోలుకు ఈ బడ్జెట్ నుండి నిధులు ఖర్చు చేయాల్సి వుంటుంది. జిల్లా మలేరియా విభాగంకు ఈ ఆర్థిక సంవత్సరానికి మంజూరైన బడ్జెట్‌లో ఇప్పటి వరకు కొద్ది మేరకు మాత్రమే ఖర్చు చేసిన జిల్లా మలేరియా విభాగం అధికారులు మిగిలిన మొత్తంను ఖర్చు చేయకుండా అలాగే వుంచేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలోపు ఈ నిధులు ఖర్చు చేయకుంటే నిధులు మురిగిపోయే అవకాశం వుంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో దోమలు అత్యధికంగా ఉత్పత్తి అయ్యే అవకాశాలు పుష్కలంగా వున్నాయి. ఎక్కడైతే నీరు నిల్వ వుంటుందో అక్కడ దోమల లార్వాలు వృద్ధి చెంది దోమలు ఉత్పత్తి అవుతాయి. జూన్ నుండి అక్టోబర్ నెలాఖరు వరకు దోమల సీజన్ ఎక్కువగా వుండటంతో జిల్లా మలేరియా విభాగం అధికారులు సైతం ఈ సమయంలో దోమలను కట్టడి చేయడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. అయితే జిల్లా మలేరియా విభాగం అధికారులు దోమలను కట్టడి చేయడానికి ఫ్రైడే డ్రైడే కార్యక్రమంను మాత్రం తూతూ మంత్రంగా నిర్వహించి దోమలను నిర్మూలించడానికి మంజూరైన బడ్జెట్‌ను ఏ మాత్రం ఖర్చు చేయడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా మలేరియా విభాగంలో ఈ ఆర్థిక సంవత్సరంలో దోమలను కట్టడి చేయడానికి మాత్రం ఇంకా 15 లక్షల రూపాయల మేరకు బడ్జెట్ వుంది. అయితే ఈ నిధులు జిల్లా మలేరియా అధికారులు ఏ మాత్రం ఖర్చు చేయడం లేదు. ఈ మూడు నెలల్లో దోమలు ఎక్కువగా ఉత్పత్తి అయ్యే అవకాశం వుండటంతో ఈ సమయంలోని జిల్లా మలేరియా అధికారులు దీనికోసం మంజూరైన నిధులను ఖర్చు చేయాలి. అయితే జిల్లా మలేరియా అధికారులు ఏం చేస్తారో! చూద్దాం.

# కాణిపాకం దేవస్థానంలో మాక్ డ్రిల్

### అత్యవసర సేవలపై సిబ్బందికి అవగాహన



బాంబులను నిర్వార్యం చేస్తున్న బాంబు డిస్పోజబుల్ స్క్వాడ్, గుండె పోటుకు గురైన వ్యక్తికి వైద్యులు ప్రథమ చికిత్స, అగ్నిప్రమాదం సంభవించనపుడు మంటలను ఆర్పుతున్న సిబ్బంది.

కాణిపాకం, ఆగస్టు 19 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో మంగళవారం పోలీసు, వైద్య, అగ్నిమాపక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. దేవస్థానంలో ఈనెల 17 నుండి సెప్టెంబర్ 16 వరకు 21 రోజుల పాటు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్న విషయం విధితమే. ఈనేపథ్యంలో దేవస్థానంలో భక్తుల రద్దీని దృష్టిలో వుంచుకుని అత్యవసర సమయంలో ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినపుడు భక్తులను ఏవిధంగా సురక్షితంగా బయటకు తీసుకురావాలనే విషయమై అవగాహన కల్పించేందుకు ఆలయం లోపుల, వెలుపల మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈసందర్భంగా దేవస్థానం ప్రధాన ఆలయంలో రద్దీగా వున్న సమయంలో ఉగ్రవాదులు బాంబు దాడులకు ప్రయత్నిస్తే, వాటిని ఏవిధంగా నిర్వీర్యం చేయాలని పోలీసు శాఖకు చెందిన బిడిఎస్ వారిచే ప్రయోగాత్మకంగా చూపించారు. అలాగే రద్దీ సమయంలో భక్తులకు ఎవరికైనా గుండెపోటు వంటి అత్యవసర వైద్య సేవలు అవసరమైనపుడు ఏ విధంగా స్పందించాలి అనే విషయమై వైద్య ఆరోగ్యశాఖకు చెందిన బృందం అవగాహన కల్పించారు. అలాగే ఆలయంలో అనుకోని విధంగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్, లేదా అగ్నిప్రమాదాల సంభవించినపుడు ఏవిధంగా స్పందించాలి, మంటలను ఏవిధంగా అదుపు చేయాలనే విషయమై అగ్నిమాపక శాఖ వారు అవగాహన కల్పించారు. ఆలయంలో క్యూలైన్లు, తదితర ప్రదేశాలలో పర్యటించి వివిధ అంశాలపై దేవస్థానం ఈఓ కె.పెంచల కిషోర్‌తో చర్చించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, చిత్తూరు ఏఆర్ ఏఎస్పీ నందకిషోర్, చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, ఏఆర్ డీఎస్పీ చిన్ని కృష్ణ, సీఎఫ్ఓ నాగేశ్వరరావు, కాణిపాకం ఎస్సై నరసింహులు, కాణిపాకం పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేశ్వరి, శివయ్య, పోలీసు, వైద్య, అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. .

## ఎరువుల దుకాణాల వద్ద
# అన్నదాతల పడిగాపులు




ఎరువుల దుకాణం వద్ద ఉన్న రైతులు

వి.కోట, ఆగస్టు 19 ప్రభాతవార్త

పంటలసాగుకు అవసరమైన యూరియా ఎరువుల కోసం రైతులు ఎరువుల దుకాణాల ఎదుట పడిగాపులు కాస్తున్నారు. ఇటీవల వర్షాలు మండలంలో విస్తారంగా కురిసిన నేపథ్యంలో రైతులు వరిపంట సాగుపై దృష్టి సారించారు. మరికొందరు రైతులు పశుగ్రాసం పెంపు చేపట్టారు. వీటికి యూరియా అవసరం ఉంది. దీంతో ఎరువుల కోసం వి.కోట పట్టణంలోని ఎరువుల దుకాణాలను రైతులు ఆశ్రయిస్తున్నారు. అయితే యూరియా నిల్వలు లేవంటూ వ్యాపారులు చేతులు పైకెత్తేస్తున్నారు. యూరియా కొరత సైతం ఏర్పడింది. దీంతో వారం రోజులుగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం యూరియా స్టాకు తక్కువగా ఉ ండడంతో ఓ దుకాణదారుడు ఉదయం నుంచి దుకాణం తెరవలేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి రైతులకుఅవసరమైన యూరియాను అందుబాటులోతేవాలని రైతులు కోరుతున్నారు.

# పొదుపుగా నీటి వినియోగంతో నిరంతర సరఫరా !

### బ్రహ్మోత్సవాలకు ముందుగానే అదనపు ఈఓ పటిష్ట కార్యాచరణ



తిరుమల, ఆగస్టు 19 ప్రభాతవార్త ప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి సాధారణ రోజుల్లోనూ లక్షమంది వరకు భక్తుల తాకిడి....పెరిగిన నీటి వినియోగం....అడపాదడపా వానలు కురుస్తున్నా ఆశించిన స్థాయిలో జలాశయాలకు చేరని నీరు. ఈ నేపథ్యంలో మరోనెలరోజుల్లో ప్రారంభంకానున్న బ్రహ్మోత్సవాలకు ముందుగానే పొదుపుగా నీటివినియోగంపై టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దృష్టి సారించారు. ఇందుకు తగిన ప్రణాళికలు రూపొందించి ఇప్పటి నుండే నీటిని పొదుపుగా వాడుకోవడంపై అధికారులు చూడాలని ఆదేశించారు. మంగళవారం "వార్త" దినపత్రికలో ప్రచురితమైన "జడివానతో జలాశయాలకు చేరని నీరు"కథనంపై వాటర్‌వర్క్స్ విభాగం ఈఈ సుధాకర్ తదితరులతో అదనపు ఈఓ మంగళవారం సాయంత్రం గోకులం విశ్రాంతి భవనంలో నీటిని ప్రణాళికంగా వినియోగంపై సుదీర్ఘంగా సమీక్షచేశారు. సాలకట్ల బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచు కుని ,తిరుమలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని డ్యామ్‌లలో నీటిలభ్యత, వినియోగంపై వివరాలు తెలుసుకు న్నారు. రోజా కొండపై 43లక్షల గ్యాలన్ల వరకు నీటి వినియోగం ఉంది. 18లక్షల గ్యాలన్ల నీరు గోగర్భమ్, ఆకాశగంగ, పాప వినాశనమ్ డ్యామ్‌ల నుండి లభ్యమవుతోంది. ఇంకా చంద్రగిరి సమీపంలోని కల్యాణిడ్యామ్‌నుండి తిరుమలకు నీరు సరఫరా అవుతోంది. తిరుమలలోని ఐదు ప్రధాన జలాశయాల్లో 14,304లక్షల గ్యాలన్ల నీటిసామర్థ్యంకాగా ప్రస్తుతం 7లక్షల గ్యాలన్ల నీరు అందు బాటులో ఉందనేది సమాచారం. ఈ నీరు 180 రోజులుమాత్రమే అవసరాలకు సరిపోతుంది. తిరుమలలోని డ్యాముల ధృఢత్వంపై సమగ్ర నివేదిక అందించాలని వాటర్‌వర్క్స్ అధికారులను ఆదేశించారు. ఇప్పుడు బ్రహ్మోత్సవాలకు ముందు నీటిసమస్య లేకుండా చూడటానికి అదనపు ఈఓ చౌదరి కార్యాచరణ సిద్ధంచేశారు. భక్తులు, స్థానికులు నీటిని పొదుపుగా వినియోగించాలని, నీటి వృధాను అరికట్టాలని ,అనవసరంగా వృధాచేయరాదని అధికారులకు సూచించారు.

## ఘనంగా ముగిసిన జాతీయ ఆగమసదస్సు

తిరుపతి విద్య ఆగస్ట్ 19 ప్రభాత వార్త:



జాతీయ సంస్కృత వర్సిటీలో రెండు రోజులు జరిగిన ఆగమ సదస్సు వైభవముగా ముగిసినది. ముగింపు సమావేశానికి అకడమిక్ డీన్ ఆచార్య రజనీకాంత్ శుక్ల ముఖ్యాతిథులుగా పాల్గొని ఆయన మాట్లాడుతూ ఆగమశాస్త్ర అధ్యయనం అవశ్యం కర్తవ్యమని ఆగమగ్రన్థాలముద్రణ పరిశోధన సదస్సులనిర్వహణ విశ్వవిద్యాలయబాధ్యత అనీ అందుకు అనుక్షణం విద్యాపీఠం కృషి చేస్తున్నదని అతి చిన్నవయస్సులోనే ఆగమ గ్రన్థ అధ్యయనం అవశ్యం కర్తవ్యమని అం దుకు తగిన సౌకర్యాలు విద్యాపీఠం ఏర్పాటుచేస్తున్నదని అన్నారు. తమిళనాడు కర్ణాటక ప్రాంతాలనుండి విచ్చేసిన ప్రతినిధులకు యోగ్యతాపత్రప్రదానం చేశారు. ఈ సదస్సులో చెన్నై నుండి విచ్చేసిన ఉరగడం లక్ష్మీనరసింహం డా. చావలి. పవన్ వంశీ శ్రీ శైలజా, ఉమామహేశ్వరి తదితరులు ఆయా ఆగమాలపై పత్రసమర్పణ చేశారు. ఈ చతురాగమ సదస్సు కన్వీనర్ గా దర్శనసంకాయప్రముఖులు ఆగమ విభాగాధ్యక్షులు ప్రొఫెసర్ వేదాన్తం శ్రీవిష్ణుభట్టాచార్యులు వ్యవహరించారు

## శ్రీవారిమెట్టు వద్ద వైసిపి శ్రేణుల పాదయాత్రతో ఉద్రిక్తత

**రాజకీయ జెండా, అజెండాతో కొండకు వెళ్ళొద్దు.. పోలీసులు**
**పోలీసులు, టిటిడి చైర్మన్ అన్యాయంగా అడ్డుకున్నారు.. వైసిపి**

చంద్రగిరి, ఆగస్టు 19 ప్రభాతవార్త:




శ్రీవారిమెట్టు మార్గంలో వైసిపి శ్రేణుల పాదయాత్రను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత చోటుచేసుకున్నది. ఎంపి పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి ఆరోగ్యంగా జీవించాలనే ఆకాంక్షతో తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి వారికి మొక్కులు తీర్చుకు నేందుకు అన్నయ్య జిల్లా నుండి పెద్ద ఎత్తున వైసిపి శ్రేణులు కాలినడకన శ్రీనివాస మంగాపురం చేరుకున్నారు. ఈ క్రమంలో వైసిపి శ్రేణులు పెద్ద ఎత్తున జెండాలతో నినదిస్తూ వస్తున్నట్లు సమాచారం అందుకున్న చంద్రగిరి డిఎస్పీ ప్రసాద్ సబ్ డివిజన్‌లోని తిరుపతి రూరల్, చంద్రగిరి, పాకాల పోలీసు అధికారులను అప్రమత్తం చేశారు. శ్రీవారిమెట్టు వద్దకు చేరుకున్న పోలీసు బలగాలు వైసిపి శ్రేణులను అడ్డుకుని వారి వద్దగల వైసిపి జెండాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో తిరుమలకు రాజకీయ జెండాలతో గానీ, రాజకీయ అజెండాతో గానీ వెళ్ళొద్దని పోలీసులు వారించారు. దీంతో వైసిపి శ్రేణులు మ్రొక్కులు తీర్చుకునేందుకు వెళుతున్నట్లు చెప్పడంతో ఇందులో మొదట కొంత మందిని ఎంపిక చేసి పంపించారు. అయితే పోలీసు ఆంక్షలను కాదని మరి కొందరు దూసుకు వెళ్ళడంతో కొంత గందరగోళం ఏర్పడింది. దీంతో వైసిపి నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అందరి వివరాలను తీసుకుని సాయంత్రం వదలిపెట్టారు. ఈ సందర్భంగా వైసిపి విద్యార్థి విభాగం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు కిషోర్ మాట్లాడుతూ తిరుమలకు కాలినడక వేళ్ళే భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించే టిటిడి పోలీసులను అడ్డుపెట్టుకుని టిటిడి చైర్మన్ ఒక రాజకీయ నాయకుడి వలే తమను అడ్డుకోవడం అన్నాయమన్నారు.

## పోలీసుల అదుపులో ఎర్రచందనం స్మగర్, రెండు కార్లు, 20 దుంగలు స్వాధీనం

రేణిగుంట ఆగస్టు 19 ప్రభాతవార్త :తిరుపతి జిల్లా రేణిగుంట మండలం ఆంజనేయపురం చెక్‌పోస్ట్ వద్ద టాస్క్‌ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ సూచనలతో డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో టాస్క్ ఫోర్స్ పోలీసులు మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా మామండూరు వైపు నుండి రేణిగుంట వైపుకు రెండు కార్లు వేగంగా రావడాన్ని గుర్తించారు. టాస్క్ ఫోర్స్ పోలీసులు రెండు కార్లను అడ్డుపడి ఆపారు. ఒక కారు డ్రైవర్ పారిపోగా, మరో కారు డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నారు. వాహనాలు తనిఖీ చేయగా దాదాపు 20 ఎర్రచందనం దుంగలు దొరికాయి. పట్టుబడిన డ్రైవర్ కర్ణాటక వ్యక్తిగా గుర్తించారు. వాహనాలు తనిఖీ చేసిన వారిలో ఆర్ఐ సాయి గిరిధర్, ఆర్ఎస్సై వినోద్ కుమార్ బృందం ఉన్నారు. పట్టుబడిన వ్యక్తిని, ఎర్రచందనం దుంగలను, కార్లను తిరుపతి టాస్క్ ఫోర్స్ స్టేషన్ కు తీసుకెళ్లారు. ఎస్సై రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఇన్నర్ సూపర్: అవుటర్ అధ్వాన్నం

### ఇన్నర్ సూపర్: అవుటర్ అధ్వాన్నం.. జ్ఞానమ్మ కండ్రిగలో రోడ్ల దుస్థితి ఇది

**తొట్టంబేడు మండలంలోని గ్రామాల రోడ్ల పరిస్థితి అద్వాన్నంగా మారింది. పట్టణానికి సరిహద్దుల్లో గల గ్రామాల్లో రోడ్లు చక్కగా పంచాయతీనిధులతో సిమెంటు రోడ్లు నిర్మించారు. అయితే గ్రామ పొలిమేరల్లో రోడ్లు పరిస్థితి ఆధ్వాన్నంగా ఉంది. ప్రభుత్వం,స్థానిక ప్రజా ప్రతినిధి ప్రధాన రోడ్లను చక్కగా సిమెంటు రోడ్లుకు నిధులు సాధించి ముస్తాబు చేస్తున్నారు.కానీ గ్రామానికి ముందు ఉన్న రోడ్ల అధ్వాన్నస్థితిపై దృష్టి సారించటం లేదు. దాంతో మధ్యలోరోడ్లు పరిస్థితి పరిశీలిస్తే అబ్బో అనిపిస్తుంది.**



గుంతల మయంగామారిన కాసాతోట రోడ్డు

తొట్టంబేడు, ఆగస్టు 19 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణానికి కూత వేటు దూరంలో తొట్టంబేడు మండలం జ్ఞానమ్మకండ్రిగ, కొత్త కండ్రిగ గ్రామాలున్నాయి. తెలుగుదేశం పార్టీకి అత్యధిక ఓట్లు సంపాదించే ఈ గ్రామంలో గతంలో ఓ యువకుడు సర్పంచ్‌గా గ్రామంలో సిమెంటురోడ్లు వేయించారు. అయితే రోడ్లపక్కన వదలిపెట్టడంతో ఒక వాహనం వస్తే మరోవాహనం పయ నించే పరిస్థితి లేదు. అయితే ఈ గ్రామానికి వెళ్ళాలంటే నాయుడుపేట: రేణిగుంట జాతీయ రహదారిని దాటాల్సి ఉంటుంది. ఇదో ప్రమాదకర పరిస్థితి రోడ్డు దాటాలంటే కనీసం సూచిక బోర్డుల్లేదు. ఇక శ్రీకాళహస్తి నుంచి ఈ గ్రామానికి వెళ్ళాలంటే మధ్య కాసాతోట సమీపంలో రోడ్డు ఉంది. ఈ రోడ్డు పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. చినుకుపడితే ఈ రోడ్లు ఒక తటాకాల్లా మారింది. ఇక్కడ రోడ్డు ఎక్కడుందో లేదో తెలియని స్థితి చోటు చేసుకుంది. ఈ గుంతలు రోజు రోజుకు పెరిగి నేడు మోకాలు లోతు గుంతలు మారాయి. దాంతో ఇక్కడ వాహనాలు నడవటం ప్రశ్నార్థకంగా మారింది. ఈమార్గంలోని అధికార పార్టీ నాయకులు పయనిస్తుంటారు. కానీ పట్టించుకోరు. ఇక్కడ రెసిడెన్షియల్ గురుకులానికి ఆదివారం వందలాది మంది తల్లిదండ్రులు వస్తుంటారు. వారి వాహనాలు ఎలా నడపాలో అంతుచిక్కని పరిస్థితి చోటు చేసుకుంది. ఇక జ్ఞానమ్మ కండ్రిగ గ్రామానికి వెళ్ళె ద్విచక్రవాహనాలు నంది సర్కిల్ వరకు వెళ్ళి తిరిగిరావాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో కొత్త వారు వాహనాలు నడపాలంటే ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా పట్టణంలో పనులు చూసుకొని రాత్రి ఇళ్ళకు వెళ్లె వారు ద్విచక్రవాహనాలపై వెళ్ళాలంటే ఇబ్బంది పడుతున్నారు.

## నానో యూరియా వాడకంతో రైతులకు లాభాలు

– జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ



పెద్దపంజాణి, ఆగస్టు 19 ప్రభాతవార్త

నానో యూరియా వాడకంతో రైతులకు లాభాలు కలుగుతాయని జిల్లా వ్యవసాయాధికారి మురళీక ృష్ణ పేర్కొన్నారు. మంగళవారం రాజుపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా డిఎఒ మాట్లాడుతూ నేతల్లో సేంద్రీయ పదార్థం తక్కువగా ఉండడంతో రైతులు తప్పక జనుము, జీలుగను వాడాలన్నారు. అన్నదాత సుఖీభవ గ్రీవెన్స్ నమోదును బుధవారం లోగా అర్హత కలిగిన రైతులు చేయించుకోవాలన్నారు.అనంతరం మండల ప్రత్యేకాధికారి అయిన మురళీకృష్ణ తమ్మినాయనపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు, పిల్లలకు అందించే ఆహారాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎడిఎ శివకుమార్, ఎస్వో చౌదరి, ఎఓ హేమలత, పంచాయతీ కార్యదర్శి రిజ్వానా, నేతలు భానుప్రతాప్‌రెడ్డి, మంజునాథరెడ్డి పాల్గొన్నారు.

## మదర్ థెరిసా విద్యార్థులకు నేషనల్ కరాటే చాంపియన్‌షిప్

పెద్దపంజాణి, ఆగస్టు 19 ప్రభాతవార్త




మండలంలోని మదర్ థెరిసా పాఠశాల విద్యార్థులు ఆలిండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌ను సాధించారని విద్యాసంస్థల ఛైర్మన్ డా॥ రవీ ంద్రబాబు తెలిపారు. ఒంగోలు పట్టణంలోని పర్వతరెడ్డి ఆనంద్ మినీ ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో వివిధ రాష్ట్రాలనుంచి సుమారు ఆరువందల మంది విద్యార్థులు హాజరు కాగా తమ పాఠశాల విద్యార్థులు చాంఫియన్‌షిప్ సాధించారన్నారు. ఆరుమంది బంగారుపతకాలు, ఏడుమంది రజత పతకాలు, పదిహేను మంది కా ంస్య పతకాలు సాధించారన్నారు. ఈసందర్భంగా విద్యార్థు లను ఛైర్మన్ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డేవిడ్, కరాటేమాస్టర్ డా॥ సదాశివ పాల్గొన్నారు.

## స.హ.చట్టంతో ప్రజలు కోరిన సమాచారం - మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు

కుప్పం, ఆగస్టు 19 ప్రభాతవార్త




సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలు ప్రభుత్వ శాఖల నుంచి కోరిన సమాచారం పొందే అవకాశం ఉందని మున్సిపల్ కమీషనర్ ఉయ్యాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమీషనర్ డా॥ చావలి సునీల్ ఆదేశాల మేరకు మంగళవారం మున్సిపల్ పరిధిలోని అన్ని సచివాలయాల్లో స.హ.చట్టంపైప్రజలకు అవగాహన కల్పించే నిమిత్తం మున్సిపల్ కార్యాలయంలో అడ్మిన్ సెక్రటరీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 21-23 తేదీల్లో మున్సిపల్ పరిధిలోని అన్ని సచివాలయాల్లో స.హ.చట్టంపై అవగాహన సదస్సులు నిరవహించడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సదస్సులకు హాజరు కావాలని కమీషనర్ కోరారు.

## కరాటే పోటీల్లో విజయవాణి విద్యార్థి ప్రతిభ

శ్రీకాళహస్తి,ఆగస్టు 19 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణంలో విజయవాణి పాఠశాల విద్యార్థి కరాటే పోటీల్లో విజయం సాధించినట్లు మంగళవారం సత్కరించారు. శ్రీకాళహస్తిలోని విజయవాణి ఈ -టెక్నో ఒపింపియాడ్ పాఠశాల విద్యార్థి చంద్రమౌళి ప్రతిభ చూపి పతకాన్ని సాధించారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి చంద్రమౌళి ఈ నెల 17న చెన్నైలో నిర్వహించిన జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ 2025లో చంద్రమౌళి మూడవ బహుమతి సాధించి శ్రీకాళహస్తికి పాఠశాలకు మంచి పేరు తెచ్చారని కరస్పాండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్యామలారెడ్డి చంద్రమౌళిని సత్కరించారు.

## గిరిజన కాలనీ విద్యార్థులకు'హెల్పింగ్ హ్యాండ్స్' వితరణ

శ్రీకాళహస్తి,ఆగస్టు 19 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పొలిమేరల్లోని గిరిజన కాలనీలో వెలసిన పాపాగారి సుభద్రమ్మ పురపాలకం సంఘ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం హెల్పింగ్ హ్యాండ్స్ సారథ్యంలో వితరణ అందించారు. ఈ పాఠశాల అభివృద్ధికి ఆది నుంచి పాపాగారి కుటుంబసభ్యులు కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ పాఠశాలలో 40 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.ఇక్కడి విద్యార్థుల్ని ఆహ్లాదపరచుటకు చైతన్యవంతుల్ని చేయుటకు హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు మునీర్‌బాషా ఆటసామగ్రిని వితరణగా అందించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా బిజెపి నాయకుడు న్యాయవాది గరికపాటి రమేష్‌బాబు మట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు చెస్,క్యారంబోర్డు, బ్యాట్లు, క్రీడా పరికరాలు అందించారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలన్నారు.ఈ కార్యక్రమాల్లో సంస్థ వ్యవస్థాపకులు మునీర్‌బాషా, బాబాఫరీద్,నెల్లూరు గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన జోనల్ స్థాయి నేషనల్ స్పోర్ట్స్ డే టోర్నమెంట్

తిరుపతి క్రీడ, ఆగస్టు 19, ప్రభాతవార్త



జిల్లా క్రీడ ప్రాధికార సంస్థ తిరుపతి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెండు రోజులు పాటు శ్రీ శ్రీనివాస క్రీడా సముదాయంలో నిర్వహించిన జోనల్ స్థాయి నేషనల్ స్పోర్ట్స్ డే టోర్నమెంట్ మంగళవారంతో విజయవంతంగా ముగిసింది. చిత్తూరు, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన సుమారు 2362 మంది క్రీడాకారులు ఉత్సాహంగా వివిధ క్రీడా విభాగాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, ఇ. రజిని హాజరై విజేతలకు, ఆటగాళ్లకు సర్టిఫికేట్లు అందజేసారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ క్రీడాకారుల క్రమశిక్షణ కృషి, క్రీడాస్ఫూర్తిని అభినందిస్తూ ఫిట్ ఇండియా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ టోర్నమెంట్ విజయవంతం కావడానికి కృషి చేసిన రాయలసీమ 8 జిల్లాల డిఎస్‌డిఓలు, కోచ్‌లు, ఆఫీస్, సిబ్బంది, శారీరక విద్యా శాఖ వ్యాయామ ఉపాధ్యాయులు,వాలంటీర్లకు,సహాయసహకారాలు అందించిన వివిధ జిల్లా అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

## శ్రీకాళహస్తిలో నాలుగుబార్లకు అనుమతి: ఎక్సైజ్ సిఐ

శ్రీకాళహస్తి, ఆగస్టు 19 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణంలో నాలుగు బార్లు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించిందని ఎక్సైజ్ సిఐ లావణ్య మంగళవారం మీడియాకు తెలిపారు. ఇందుకు దరఖాస్తులను ఆహ్వానించినట్లు ఆమె తెలిపారు.ఇందులో ఒక బార్‌ను గౌడ కులస్తులకు రిజర్వ్ చేయబడినట్లు తెలిపారు. బార్‌లైసెన్సులకు ఈ నెల 26లోపల దరఖాస్తులు చేసుకోవాలని ఆమె వివరించారు. మూడు బార్లు జనరల్ కేటగిరిలో మంజూరు చేసినట్లు తెలిపారు. బార్‌లకు ఏడాదికి రూ.55లక్షలు లీజు సొమ్ములు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.గౌడ్ కులస్థులకు కేటాయించిన బార్‌కు రూ.27.5లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్,ఆఫ్‌లైన్ హైబ్రిడ్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. కాగా లైసెన్సు ఫీజులు రూ.55లక్షలు ఆరు కంతులుగా ఏడాదిలో చెల్లించాల్సి ఉంటుందన్నారు.

## రోజూ 5,500 మంది మహిళలు ఉచిత ప్రయాణం

శ్రీకాళహస్తి,ఆగస్టు 19 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి ఆర్‌టిసి డిపో నుంచి ప్రతి రోజూ స్త్రీశక్తి పథకంలో 5500 మంది మహిళలు ప్రయాణిస్తున్నట్లు ఆర్‌టిసి డిపో మేనేజర్ మునిచందు మంగళవారం మీడియాకు తెలిపారు. ఈ పథకంలో పయనం మహిళలకు ఎంతో ప్రయోజనకరంగా ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేసారు. రోజుకు ప్రభుత్వం స్త్రీశక్తి పయనంలో మహిళల కోసం ప్రభుత్వం రూ.2.2లక్షలు చెల్లిస్తుందని ఆయన తెలిపారు.ఈ పథకానికి డిపో ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేసినట్లు వివరించారు.శ్రీకాళహస్తి ఆర్‌టిసి డిపో పరిధిలో 33 పల్లెవెలుగు బస్సులున్నాయన్నారు. మూడు ఎక్స్‌ప్రెస్ బస్సుల ద్వారా మహిళలు స్త్రీశక్తి పథకంలో ఉచిత పయనం చేస్తున్నారని మేనేజర్ వివరించారు.రోజుకు బస్సుల్లో 20వేల మంది పయనిస్తుంటే జీరో టిక్కెట్లు 5500 ఉన్నాయని ఆయన తెలిపారు. నెలకు ప్రభుత్వం మహిళల ఉచితప్రయాణానికి శ్రీకాళహస్తి డిపోకు రూ.68లక్షల వంతున ఏడాదికి రూ.8కోట్లు వరకు చెల్లిస్తుందని తెలిపారు.

## రైతులకు అవగాహన సదస్సు

పాలసముద్రం, ఆగస్టు 19 ప్రభాతవార్త : పాలసముద్రం మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో మంగళవారం గంగాధర్ నెల్లూరు సహకార సంఘ బ్యాంకు మేనేజరు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార సంఘ బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ సహకార సంఘ బ్యాంకు ద్వారా కొత్త ఇల్లు నిర్మించుకోవడానికి, పాత ఇళ్లపై రుణం, బంగారు ఆభరణాలపై రుణం, రైతు సంఘాలకు రుణం ఇలా అన్ని రకాల రుణాలు తక్కువ వడ్డీకి అందిస్తామని తెలిపారు. డిపాజిట్లపై ఆకర్షణమైన వడ్డీరేట్లు అందిస్తామని తెలిపారు. సహకార సంఘ బ్యాంకు నందు లాకర్ సౌకర్యం కూడా ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి గంగాధర్ నెల్లూరు సహకార సంఘ బ్యాంక్ మేనేజర్ గోమతి , సూప్రవైజర్ మాభూని , పాలసముద్రం మండల సహకార సంఘ సిబ్బంది మరియు మండల రైతులు పాల్గొన్నారు.

## బిసీ వర్గాలకు ఎన్డీఏ ప్రభుత్వం మద్దతు

– సీనియర్ బిజెపి నాయకులు చిట్టిబాబు కొల్లా



చిత్తూరుహెల్త్, ఆగస్టు 19 ప్రభాతవార్త:

బిసీ వర్గాలకు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం గట్టి మద్దతుగా నిలుస్తోందని సీనియర్ బిజెపి నాయకులు చిట్టిబాబు కొల్లా పేర్కొన్నారు. ఎన్డీఏ కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా బిసీ వర్గానికి చెందిన సిపి రాధాకృష్ణన్‌ను ఎంపిక చేయడం ఇందుకు నిదర్శంగా నిలుస్తోందన్నారు. సిపి రాధాకృష్ణన్ ఒక సాధారణ పేద కుటుంబంలో జన్మించి విద్యను అభ్యసించడం కోసం పలు కష్టాలను ఎదుర్కొన్నారన్నారు. తమిళనాడు రాష్ట్రంలోని కొంగు వెల్లార్ గౌండర్ సామాజిక వర్గానికి సిపి రాధాకృష్ణన్ చెందిన వారన్నారు. ఈ సామాజిక వర్గం తమిళనాడులో ఆర్థికంగా వెనుబడి వున్న వర్గమన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి రూ.63 వేలు జరిమానా

చిత్తూరుహెల్త్, ఆగస్టు 19 ప్రభాతవార్త:

చిత్తూరు టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారితో పాటు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడిన వారి నుండి 63 వేల రూపాయల జరిమానా విధించినట్లు టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య తెలిపారు. టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ఆరు మంది ద్విచక్ర వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారని, అలాగే ముగ్గురు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పోలీసులకు పట్టుబడ్డారన్నారు. వీరిని మంగళవారం కోర్టుకు హాజరు పరిస్తే జడ్జి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఒక్కొక్కరికి 10 వేల రూపాయలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడిన ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు జరిమానా విధించారన్నారు.

## ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులు తొలగింపుకు చర్యలు

– ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి వైఎస్ఆర్‌టిఎ వినతి

చిత్తూరు, ఆగస్టు 19 ప్రభాతవార్త:

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఆర్థిక ఇబ్బందులను తొలగించాలని వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి వి.రెడ్డిశేఖర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శికి ఆయన మంగళవారం లేఖ రాస్తూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఉద్యోగుల ఆర్థిక బకాయిలు చెల్లించడంలో విఫలమైందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఐఆర్ ఇసామని హామీ ఇచ్చి విస్మరించడం సరికాదన్నారు. ఈ మేరకు బుధవారం జరిగే జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఉద్యోగుల పట్ల అనుకూల నిర్ణయాలు తీసుకుని వారిని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. అలాగే ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన నాలుగు డిఎలు, ఆర్జిత సెలవులు చెల్లింపులు సత్వరం చెల్లించాలనిడిమాండ్‌చేశారు.అలాగేపిఆర్‌సికమీషన్‌నుఏర్పాటుచేసి30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలన్నారు.

## అవినీతి అరాచకాలకు మారుపేరు వైకాపా

– రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటేల సురేంద్రకుమార్



చిత్తూరు, ఆగస్టు 19 ప్రభాతవార్త:

రాష్ట్రంలో అరాచకాలు, అవినీతి, అసత్య ప్రచారాలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మారు పేరని రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటేల సురేంద్రకుమార్ పేర్కొన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో వున్నా, ప్రతిపక్షంలో వున్నా అరాచకాలు, అసత్య ప్రచారాలను విస్తృతంగా కొనసాగిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవడం, పెట్టుబడులు రాకుండా చేయడం, సంక్షేమ పథకాలను నీరుకార్చడం కోసం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పనిగట్టుకుని తమ సామాజిక మాధ్యమాలు, సొంత మీడియా, అనుబంధ టీవీ ఛానెళ్ల ద్వారా తెలుగు దేశం ప్రభుత్వం, పార్టీ నాయకులు మీద విషం కక్కుతుందన్నారు. రాష్ట్రంలో అధిక వర్షాలు కురవడంతో రాజధాని అమరావతి వర్షాలకు మునిగిపోయిందని, ప్రాజెక్టులు కొట్టుకుపోతున్నాయని, పొన్నూరును ముంచేశారని, ప్రకాశం బ్యారేజీ ప్రమాదంలో పడిందని అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

## రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

– టిడిపి మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్



కుప్పం,ఆగస్టు 19 ప్రభాతవార్త

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అని టిడిపి మండల అధ్యక్షుడు మల్లానూరు ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గరిగచీనేపల్లి రైతు సేవా కేం ద్రంలో పశు సంవర్ధక శాఖ అధ్వ ర్యంలో రైతులకు మొక్కజొన్నల విత్తనాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు 75శాతం రాయితీతో మొక్కజొన్న విత్తనాలు అందిస్తున్నట్లు తెలిపారు. 5కిలోల ప్యాకెట్‌ను రూ 85లకే అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎడి రెడ్డికుమారి, పశువైద్యుడు డా॥ రవిశంకర్, నితీష్‌కుమార్, స్థానిక నేతలు, రైతులు పాల్గొన్నారు.

## బాలికల హాస్టల్ విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ

వి.కోట, ఆగస్టు 19 ప్రభాతవార్త



స్థానిక ప్రభుత్వ బాలికల హాస్టల్‌లో ఉన్న విద్యార్థినులకు టిడిపి మండల తెలుగుయువత అధ్యక్షుడు పిఎంఆర్ ధీరజ్ మంగళవారం ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. తన జన్మదినం సందర్భంగా హాస్టల్ విద్యార్థినులకు భోజన వసతి సైతం కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులకు తనవంతు సాయం చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నేతలు రంగనాథ్, సుబ్బన్న, నారాయణస్వామి, విశ్వేశ్వరరావు, మురుగేష్, కోదండ, చ ందు, గౌస్‌పీర్, ఇక్బాల్ పాల్గొన్నారు.

## వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి

శాంతిపురం, ఆగస్టు 19 ప్రభాతవార్త

వినాయక చవితి సందర్భంగా మండలంలో వినాయక మండపాలు ఏర్పాటుచేయాలనుకునేవారు తప్పకుండా పోలీసుల అనుమతి తీసుకోవాలని రాళ్లబూదుగూరు ఎస్సై నరేష్ పేర్కొన్నారు. అనుమతులు లేకు ండా మండపాలు ఏర్పాటుచేస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే టువీలర్ చోదకులు విధిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలన్నారు. తద్వారా ప్రమాదాల బారి నుంచితప్పించుకోవచ్చున్నారు.హెల్మెట్‌ధరించని వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## ప్రమాదకర విద్యుత్ లైన్లు తొలగించాలి

రామకుప్పం, ఆగస్టు 19 ప్రభాతవార్త



స్థానిక డా॥ అంబేద్కర్ గురుకుల పాఠశాల వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లు తొలగించాలని రెస్కో వైస్ ఛైర్మన్ విశ్వనాథ్ పేర్కొన్నారు. మంగళవారం రెస్కో అధికారులతో కలసి పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్థంభాలు, లైన్లను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు తరచూ తగులుతున్నాయని ఇది పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజనీకుమార్, రెస్కో అధికారులు శంకర్, రాజారెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

## ఎయిర్‌పోర్ట్ భూసేకరణకై గ్రామసభలు

రామకుప్పం, ఆగస్టు 19 ప్రభాతవార్త

రామకుప్పం, శాంతిపురం మండలాల్లో నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు సంబంధించి రైతుల నుంచి భూసేకరణ నిమిత్తం ఈనెల 21వతేది కుప్పం రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీనివాసులు రాజు నేతృత్వంలో గ్రామసభలు జరుగుతాయని తహశీల్దార్ కౌలేష్ తెలిపారు. 21న అంకిరెడ్లపల్లి, కిలాక్‌పోడు, కడిసిన కుప్పం, మణీ ం ద్రం, వీర్నాగపురం గ్రామాల్లో రైతులు,ప్రజలతో గ్రామసభలు జరుగుతాయన్నారు. ప్రజలు, రైతులు తప్పక హాజరు కావాలని కోరారు.

## మాజీ మంత్రి రామచంద్రరెడ్డిని కలిసిన వైసిపి నాయకులు

పులిచెర్ల, ఆగస్టు 19, ప్రభాతవార్త



మాజీ మంత్రి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డిని తిరుపతిలో పులిచెర్ల మండలం వైసిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో మాజీ సర్పంచ్ వెంకటేష్, వైస్సార్సీపీ నాయకులు జయచంద్రా రెడ్డి, రాజేంద్ర, గోపి, చౌదరి, మధు, రకేష్ తదితరులు ఉన్నారు.

## శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు

కల్లూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త



చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం పోశం వారిపల్లి. శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఆలయంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించి మహా మంగళ హారతి గావించారు. స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిపారు. భక్తులు కోలాటాలతో భక్తి నామ స్మరణతో పండగను ఉత్సాహంగా జరుపుకున్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

చిత్తూరురూరల్, ఆగస్టు 19 ప్రభాతవార్త:



చిత్తూరు ప్రెస్‌క్లబ్‌నందు ప్రపంచఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రమేష్, ఏపియుడబ్ల్యుజే జిల్లా అధ్యక్షుడు లోకనాథన్‌ల ఆధ్యక్షతన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎంతో విలువైన క్షణాలను మధుర జ్ఞాపకంగా చూపించగలిగే ఫోటోను తీసే ఫోటోగ్రాఫర్లు సృజనశీలురని, ముఖ్యంగా మీడియా రంగంలో ఫోటోగ్రాఫర్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ కేక్‌కట్ చేసి అందరికీ పంచిపెట్టి శుభాకాంక్షలను తెలియజేసారు ఈ కార్యక్రమంలో చిత్తూరు ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు కాళేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షులు పవన్‌కుమార్, శివప్రసాద్, కోశాధికారి అనిల్, సభ్యులు శివకుమార్, రాజేష్, హరీష్, ఏపియుడబ్ల్యుజే జిల్లా కార్యవర్గసభ్యులు జయకర్, సురేష్, ఫోటో, వీడియో జర్నలిస్టులు సూరి, మహేష్, అభి, చిరంజీవి, హేమంత్, చంద్రప్రకాష్, శ్రీను, ప్రవీణ్, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గుండు బావిలో వ్యక్తి మృతదేహం

పలమనేరు టౌన్ 19, ప్రభాతవార్త:



పలమనేరు పట్టణంలోని మదనపల్లె రోడ్డులోని గుండు బావిలో గౌతమ్ (40) అనే వ్యక్తి మృతదేహం బయట పడింది. మంగళవారం మధ్యాహ్నం పోలీసుల ఆధ్వర్యంలో శవాన్ని వెలికి తీశారు. మృతుడు పలమనేరు పట్టణంలోని లింగాయత్‌వీధికి చెందిన గౌతమ్‌గా పోలీసులు గుర్తించారు. బ్యాగులో కొద్ది పాటి బట్టలు ఇతర వస్తువులు ఉన్నాయి. దారి వెంబడి వెళుతూ పక్కనే ఉన్న బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడా, కాలు జారి పడి మృతిచెందాడా లేక ఎవరైనా హత్య చేసి బావిలో పడవేశారా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. బహుశా ఈ నెల18న ఈ వ్యక్తి బావిలో పడడంతో శవమై తేలినట్లు తెలుస్తోంది. నీటిలో తేలుతున్న మృతదేహాన్ని చూసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ లోకేష్‌రెడ్డి సిబ్బందితో వెళ్ళి మృతదేహాన్ని వెలికితీసి శవపరీక్షకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ వ్యక్తి మృతికి గల కారణాలు తెలియడంలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఘనంగా ఫోటో గ్రాఫర్ల దినోత్సవం

పలమనేరు, ఆగస్టు 19, ప్రభాతవార్త:

ప్రపంచ ఫోటోగ్రాఫర్ల దినోత్సవం పలమనేరులో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఎంబిటి రోడ్డులోని నెహ్రూ విగ్రహం వద్ద ఫోటోఫర్లకు మూల పురుషుడైన టాపరే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. టాపరే జిందాబాద్, ఫోటో గ్రాఫర్ల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఫోటో గ్రఫీతో నేడు ఎన్నో కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయంటే ఇందుకు ఆరాధ్యదైవం టాపరే కాంణమని కొనియాడారు. స్వీట్లు పంచుకొని సీనియర్ ఫోటో గ్రాఫర్లను సన్మానించారు. పలమనేరు, గంగవరం,బైరెడ్డిపల్లె,బంగారుపాళ్యంమండలాలకుచెందిన దాదాపు 50 మంది ఫోటో గ్రాఫర్లు హాజరయ్యారు.

## రాజుకాలువ దురాక్రమణ

పొలాలపైకి భారీగా చెరువునీరు

పలమనేరు, ఆగస్టు 19, ప్రభాతవార్త:

పలమనేరు పెద్దచెరువు నుండి వెళ్ళే రాజుకాలువ దురాక్రమణకు గురైంది. కాలువను కొందరు రైతులు తమ పొలాల్లోకి ఆక్రమించుకోవడంతో చెరువు నీరు మొరవపొంగి పొలాల్లోకి చేరుతోంది. దీంతో పంటలు మునిగి రైతులు లబోదిబో మంటున్నారు. నీళ్ళకుంట పరిసర ప్రాంతాల్లో పంటలు మునిగిపోవడంతో రైతులు తహసీల్దార్ ఇన్బనాధన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ మంగళవారం నీటి మునిగిన పొలాలను పరిశీలించారు. పంటలు, కోళ్ళ ఫారాల షెడ్లు, పశువుల దొడ్లు మునిగి ఉండడం కళ్ళారా చూశారు. ఆక్రమణ గురైన రాజుకాలువను సర్వే చేసి న్యాయం చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. పట్టణంలోని చెత్తచెదారాలు, మురుగునీరు పెద్ద చెరువులో చేరుతోంది. దీంతో పెద్దచెరువు నుండి దుర్గంధం వ్యాపిస్తోంది. వేసవి సమీపిస్తే చెరువులో నీరు ఇంకిపోయి దుర్గంధం దారిన పోయే వారు ముక్కులు మూసుకొని వెళ్ళే వారు. దీంతో దాదాపు 7 ఏళ్ళ క్రితం చెరువు పక్కనే ఉన్న రాజుకాలువను పునరుద్ధరించి వర్షాలు పడి చెరువు నిండినపుడు నీటిని 2 కి.మీల దూరంలోని బొమ్మిదొడ్డి చెరువుకు మళ్ళించారు. ఐతే చెరువు నుండి వెళ్ళే నీరు చెత్తా చెదారాలు గాజుపెంకులు నిండిపోయి పొలాల్లోకి చేరడంతో కొందరు రైతులు బొమ్మిదొడ్డి చెరువు సమీపంలో కాలువను పూడ్చివేసి ఆక్రమించుకున్నారు. దీంతో కాలువ చెట్లు పొదలతో నిండిపోయి నీరు వెళ్ళడం నిలిచిపోయింది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు పెద్దచెరువు పూర్తి స్థాయిలో నిండి నీరు పంట పొలాలపై వెళుతోంది. కోరుతున్నారు.

## క్వారీ నిర్వహణ పై కలెక్టర్‌కు ఫిర్యాదు

– స్థానికులను విచారించిన రెవెన్యూ, మైన్స్ అధికారులు.

వెదురుకుప్పం, ఆగస్టు 19 ప్రభాతవార్త :



మండలంలోని బందార్లపల్లె సమీపంలో నిర్వహించుతున్న క్వారీ వలన తీవ్ర ఇబ్బందులుపడుతున్నామని స్థానికులు కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేయడం జరిగింది. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం రెవెన్యూ,చిత్తూరు మైన్స్ అధికారులు స్థానిక ప్రజలను విచారణ చేశారు. సందర్భంగా ప్రజలు క్వారీ నిర్వహణ వలన పెద్ద స్థాయి పేలుడుల వలన ఇళ్ళు పగుళ్ళు వస్తున్నాయని తెలిపారు. అలాగే పంటల పై దుమ్ము పడుతుందని ఇబ్బందులు పడుతున్నమని చెప్పారు. క్వారీ అనుమతులు రద్దు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. అధికారులు సేకరణ చేసిన అభిప్రాయల మేరకు జిల్లా స్థాయి అధికారులకు నివేధిక పంపుతామని, వారి నిర్ణయం ప్రకారం క్వారీ నిర్వహణ, లేదా రద్దుకు చర్యలు ఉపక్రమించడం జరుగుతుందని చెప్పారు. తహశీల్దార్ బాబు, ఎస్ఐ వెంకటసుబ్బయ్య, రెవెన్యూ అధికారులు. మైన్స్ అధికారులు, స్థాని కులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణపల్లె రైతు సేవా కేంద్రంలో ప్రింటర్ చోరీ

వెదురుకుప్పం, ఆగస్టు 19 ప్రభాతవార్త :

మండలంలోని బ్రాహ్మణపల్లె సచివాలయం పరిధిలోగల రైతు సేవా కేంద్రంలో ప్రింటర్ చోరీకి గురైన్నట్లు సిబ్బంది తెలిపారు. వారి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి ... మండలంలోని బ్రాహ్మణపల్లె రైతుసేవా కేంద్రంలో రోజులాగే సోమవారం విధులు ముగించుకుని సిబ్బంది కార్యాలయంకు తాళాలు వేసి వెళ్ళగా మంగళవారం ఉదయం విధులు హాజరైయే సమయంకు కార్యాలయం తాళాలు పగలకొట్టి ప్రింటర్ ఎత్తుకు వెళ్ళిన్నట్లు చెప్పారు. ఇతర వస్తువులు చిం దర వందరగా పడవేసిన్నట్లు చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమ యంలోఇలాంటి చర్యలకుపాల్పడ్డారని చెప్పారు. సంఘటన పై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

## ఎస్సీ మాలలపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు

పూతలపట్టు, ఆగస్టు 19, ప్రభాతవార్త

పూతలపట్టు మండలం పూతలపట్టు నివాసి ఆనగల్లు మునిరత్నం రాష్ట్ర టిడిపి ఎస్సీ విభాగం కార్యదర్శిగా నియమితులైన విషయం పూతలపటు మండల ప్రజలకు తెలిసిందే. ఇతను 1993 నుంచి దళిత వర్గాల అభివృద్ధి కోసం మానవ హక్కుల సామాజిక న్యాయం లక్ష్యంగా నిరంతరం పోరాడుతున్న ఒక కామ్రేడ్ తెలుగుదేశం పార్టీ గెలుపునకు దళిత సామాజిక వర్గానికి పెద్దగా తెలుగుదేశం పార్టీకి ఎనలేని కృషి చేశారు. కానీ వైకాపా ప్రభుత్వంలో దళితులపై జరిగిన దాడులను ఎండగట్టడమే కాకుండా తెలుగుదేశం పార్టీకి అండగా నిలబడ్డారు. కానీ ఇవాళ కరేపాకు లాగా పక్కన పడేయడం దళితులను చిన్నచూపు చూడడం కూటమి ప్రభుత్వానికి ఇది సరికాదు అని పూతలపట్టు మండలం దళిత సంఘం నాయకులు దళితులు మండిపడుతున్నారు.

## సెప్టెంబర్ 13న జాతీయ లోక్‌అదాలత్

పుంగనూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త



సెప్టెంబర్ 13న పుంగనూరులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి ఆరీఫా షేక్ తెలిపారు. కక్షిదారులకు ముందుగా ఈ విషయం తెలియజేయడం వల్ల రాజీకీ అనువైన సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ నందు రాజీ చేసుకోవడం వల్ల తద్వారా డబ్బు, సమయము అదా అవుతుందాని రాజీయే రాజమార్గం అని గ్రహించాలన్నారు.

## శబరిమలకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి

చౌడేపల్లి, ఆగస్టు 19 ప్రభాతవార్త

రాష్ట్ర మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శబరిమల అయ్యప్ప దర్శనార్థం బయలుదేరారు. యేటా స్వామి దర్శనార్థం ఆయన కేరళకు వెళ్ళడం ఆనవాయితీగా వస్తోంది. చిత్తూరు మాజీ ఎంపి ఎన్.రెడ్డెప్ప, తంబళ్ళపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, పుంగనూరు, కుప్పం, తిరుపతి తదితర నియోజకవర్గాల నుంచి అధిక సంఖ్యలో అయ్యప్పమాల ధారణతో వున్న భక్తులు తిరుపతి నుంచి పెద్దిరెడ్డితోపాటు రైలులో వెళ్ళారు.

## కొడుకు కుమార్తెలపై కొడవలితో దాడి

చౌడేపల్లి, ఆగస్టు 19 ప్రభాతవార్త

కొడుకు, కుమార్తెలతో పాటు అల్లునిపై కొడవలితో దాడికి పాల్పడిన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. బాధితుల కథనం మేరకు...మండలంలోని పంచాయతీ కేంద్రం పెద్దకొండామర్రికి చెందిన ఆంజప్ప పక్క గ్రామంలోనే ముస్లిం మహిళతో గత 15యేళ్ళుగా వివాహేతర ఏర్పరచుకున్నాడు. ప్రస్తుతం ఆంజప్ప చౌడేపల్లి సంతగేటు వద్ద టైలరింగ్ చేసుకొంటూ జీవిస్తున్నాడు. ఇటీవల ప్రభుత్వం రేషన్‌కార్డుల్లో పేర్ల ప్రక్రియ ప్రారంభించింది. దీంతో రేషన్‌కార్డులో తమ తండ్రి పేరు అలీభాషాగా వచ్చిందనీ, మేమంతా హిందువులై వుండగా అతని పేరు మాత్రం ముస్లింగా వుంటే ఇబ్బందులు వస్తాయని బాధితులు వాపోయారు. వెంటనే తమ తండ్రి వద్దకు వెళ్ళి ఈ విషయమై నిలదీశామనీ, అయితే అతను తమపై దాడి చేసినట్లు కుమారుడు విజయ్‌కుమార్, కుమార్తె అమరావతి, అల్లుడు వెంకట్రమణలు తెలిపారు. గాయపడ్డ వారిని స్థానికులు 108సేవల ద్వారా పుంగనూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

## బాల్య వివాహాలను అరికట్టాలి



కోట, ఆగస్టు 19 ప్రభాతవార్త : మండలంలో బాల్య వివాహాలను అరికట్టాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ మునికుమారి కోరారు. మంగళవారం మండల పరిధిలోని గూడలి కొండమిట్ట గిరిజన కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో సిడిపిఓ, సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. బాలికలపై లైంగిక వేధింపులు జరగకుండా సమాజంలో అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాల కారణంగా నిరక్షరాస్యత, హింస, వేధింపులు, ప్రసూతి మరణాలు, శిశుమరణాలు, పేదరికం, మానసికంగా ఆరోగ్యంపై దెబ్బతీస్తాయన్నారు. బాల్య వివాహాలను ఎవరైనా చేస్తే రెండేళ్ల జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత, అంగన్‌వాడీ కార్యకర్త కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## అనకవోలు గంగమ్మకు కుంభాభిషేకం



పెళ్లకూరు, ఆగస్టు 19 ప్రభాతవార్త : మండలం లోని అనకవోలు గ్రామం నందు వెలసియున్న శ్రీ గంగమ్మ అమ్మవారికి బుధవారం నాడు గ్రామస్తులు ఘనంగా కుంబాభిషేకం నిర్వహించడం జరిగింది. ఈ ఉత్సవంలో గ్రామ ప్రజలు అందరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఎంతో ఉత్సాహంగా పాల్గొని అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు తీర్థప్రసాదాలు సమర్పించడం జరిగింది. గ్రామ పెద్దలందరూ కలిసి ప్రతి సంవత్సరం ఆనవాయితీగా నిర్వహించడం జరుగుతుందని గ్రామస్తులు పైడాం రమణయ్య ప్రకాష్ మనీ నాగయ్య తెలియజేశారు.

## అవార్డు గ్రహీతకు సన్మానం



నాయుడుపేట, ఆగస్టు 19 ప్రభాతవార్త ; స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మంత్రి ఆనం రామానారాయణరెడ్డి చేతులు మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్న నాయుడుపేట ఎంపిడిఓ సురేష్‌బాబును ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి,అధికారులు ఘనంగా సన్మానించారు. అనంతరం నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో అవార్డు గ్రహీత ఎంపిడిఓ సురేష్ బాబును ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి, అధికారులు, మంగళవారం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి మాట్లడుతూ ఎంపిడిఓ సురేష్‌బాబు ఉద్యోగరిత్యా ప్రజలకు విశిష్ట సేవలు అందించిన విషయం గుర్తించిన జిల్లాఅధికారులు ఆయనకు ఉత్తమ అవార్డు అందించడం సంతోషంగా ఉందన్నారు.ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శిలు గోవిందయ్య, గోపాల్, భారతి, సుజాత, సిబ్బంది, తదితరులు పాల్గోన్నారు.

# పరిశీలనలో శాసనం కనుగొన్న అధ్యాపకులు



గూడూరు, ఆగస్టు 19 ప్రభాతవార్త: చరిత్ర విద్యార్థుల క్షేత్ర స్థాయి పరిశోధనలో భాగంగా చిట్టేడు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థుల క్షేత్ర స్థాయి పరిశీలనలో భాగంగా చరిత్ర అధ్యాపకుడైన డాక్టర్ గోవిందు సురేంద్ర ఆధ్వర్యంలో విద్యార్థులు జరిపిన పరిశోధనలో పలు ఆసక్తి గల అంశాలు బయట పడ్డాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శివ ప్రసాద్ తెలిపారు. చిట్టేడు గ్రామంలో గత సంవత్సరం మా కళాశాల చరిత్ర అధ్యాపకుడు మరియు విద్యార్థులు క్రీ.శ. 1678 నాటి శాసనము కనుగొన్నారు. తర్వాత ఇప్పుడు ఆ శాసనం కనుగొన్న చుట్టూ గల పరిసర ప్రాంతంలో వివిధ ఆకారంలో గల కుండ పెంకులు, ఆనాటి మానవులు ఉపయోగించిన అనేక రాతి వస్తువులు లభించాయి. యంత్రాలను ఉపయోగించి భూమిని దున్నటం వలన భూమి లోపల గల వివిధ వస్తువులు చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. పురావస్తు పద్ధతులను ఉపయోగించి ఈ ప్రాంతంలో పరిశోధనలు జరిపితే చారిత్రక సంపదను గుర్తించవచ్చు అని డాక్టర్ గోవిందు సురేంద్ర పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఒక వినాయకుని ప్రతిమ చిట్టేటమ్మ ఆలయానికి దూరంలో పొలంలో పడి ఉండడాన్ని కూడా గుర్తించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సహాయకుడు కె. జనార్ధన్, గ్రామస్థుడు సురేశ్, చరిత్ర విద్యార్థులు శ్యామ్, చెంచు రామయ్య, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవకు మరో అవకాశం



కోట, ఆగస్టు 19 ప్రభాతవార్త: మండలంలోని పలువురు రైతులకు అన్ని అర్హతలు ఉన్నా అన్నదాత సుఖీభవ సొమ్ము జమ కాలేదు. ఈకేవైసీ పెండింగ్, బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాకపోవడం, ఖాతాలు వాడుకలో లేకపోవడం తదితర కారణాలతో ఈ పథకానికి కొంతమంది దూరమయ్యారు. వీరికి అన్యాయం జరగకుండా కూటమి ప్రభుత్వం ఈ నెల 20వ తేదీ వరకు రైతు సేవా కేంద్రాల్లో మరోసారి అర్జీలు ఇచ్చుకునేందుకు అవకాశం కల్పించిందని మండల వ్యవసాయ అధికారి సుచేంద్రప్రసాద్ కోరారు. మంగళవారం కోట మండలం కేశవరం, మద్దాలి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులందరూ తమ సాగు పంటల వివరాలను ఈ-పంటలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ-పంటలో నమోదు చేయడం వలన రైతులకు పంట నష్టం జరిగినప్పుడు వ్యవసాయ యాంత్రీకరణలో అర్హులుగా ఉండటానికి, ధాన్యం కొనుగోలు చేసుకోవడానికి వీలు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సాయికుమార్, విఎఎ మనోహర్, రైతులు పాల్గొన్నారు.

## చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి : సీఐ



పెళ్లకూరు, ఆగస్టు 19 ప్రభాతవార్త : వినాయక చవితి ఉత్సవములను ప్రశాంత వాతావరణం లో జరుపుకోవాలని బుధవారం నాడు పెళ్లకూరు పోలీస్ స్టేషన్ వద్ద వినాయక చవితి ఉత్సవ నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో సీఐ సంగమేశ్వర రావు తెలియజేశారు. ఉత్సవ నిర్వాహకులు ఉద్దేశించి ఎస్సై నాగరాజు మాట్లాడుతూ ఈనెల 27 నుంచి జరిగే వినాయక ఉత్సవాలకు తప్పనిసరిగా పర్మిషన్ తీసుకోవాలని అన్నారు. మండపాలు వద్ద ఎలాంటి గొడవలు లేకుండా ప్రజల అందరితో కలిసి ఆనందంగా జరుపుకునే బాధ్యత నిర్వాహకుల దే అన్నారు.

## అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

గూడూరు, ఆగస్టు 19 ప్రభాతవార్త: నాయి బ్రాహ్మణుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని ఇప్పుడు సెలూన్ షాపుల్లో 200 యూనిట్ల లోపు వస్తే కరెంటు ఉచితంగా ప్రభుత్వం కల్పించిందని గతంలో ఆదరణ పథకం ద్వారా నాయి బ్రాహ్మణులకు లోన్‌లు పనిముట్లు ఇవ్వడం జరిగిందని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ గుర్తు చేశారు. గూడూరు పట్టణం లోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద నాయి బ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాయి బ్రాహ్మణుల అభివృద్ధికి టిడిపి ఎప్పుడు కట్టుబడి ఉంటుందని 200 యూనిట్ల లోపు కరెంటు ఉచితంగా ఇవ్వడం జరిగిందని తెలిపారు. అలాగే దేవాలయ కమిటీల్లో నాయి బ్రాహ్మణులకు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల గురుస్వామి, ధనుంజయ్, వెంకటేశ్వర్లు, రాజా, గురుమూర్తి, గోపాల్, ప్రతాప్, ప్రసాద్, బిల్లు చెంచురామయ్య, వెంకటేశ్వరరాజు, రహీం తదితరులు పాల్గొన్నారు.

## వాకాడు పోలీస్ స్టేషన్‌ను డిఎస్‌పి అకస్మిక తనిఖీ



వాకాడు, ఆగస్టు 19 ప్రభాతవార్త : వాకాడులో పోలీస్ స్టేషన్ మంగళవారం గూడూరు డిఎస్‌పి గీత ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్లోని పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, పెండింగ్ కేసు వివరాలను ఎస్సై నాగబాబును అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతల విషయంలో రాజీ పడకుండా, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలను అందించాలన్నారు. ఫ్రెండ్లీ పోలీస్‌ను అభివృద్ధి పరచాలి, ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. డీఎస్పీ వెంట సిఐ హుస్సేన్ బాబు, ఎస్సై నాగబాబు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



పెళ్లకూరు ఆగస్టు 19 ప్రభాతవార్త : మండలంలో స్థానికంగా పెళ్లకూరులో ఉన్న చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో బుధవారం నాడు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మండలంలోని చుట్టుపక్కల గ్రామాలతో పాటు ఇతర ప్రదేశాల నుంచి కూడా అనేక రకాల చర్మ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు మరియు చిన్న పిల్లలకు వచ్చే రోగాలతో ఇబ్బంది పడుతున్న వారు విశేషంగా పాల్గొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సి కీర్తి తేజ ఎండి పీడియాట్రిక్స్ మరియు డాక్టర్ చాగణం కావ్య ఎండి డివిఎల్ పాల్గొని రోగులకు అనేక రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మెడిసిన్ అందజేశారు. ఈ ఉచిత వైద్య శిబిరం విజయవంతం పట్ల చాగణం ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ గౌరీ శంకర్ ఆనందం వ్యక్తం చేస్తూ పేద ప్రజలకు సేవ చేయడంలో మా ట్రస్ట్ ఎప్పుడు ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో సీతారామాంజనేయులు ఏవో కృష్ణ మరియు ట్రస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మకు అన్నా అనిత...బంగారుకాసుల హారం



తిరుమల,ఆగస్టు 19 ప్రభాతవార్త ప్రతినిధి: పుణ్యక్షేత్రం తిరుమలలో వెంగమాంబ అన్నప్రసాదం భవనం పక్కన కొలువైన రేణుక ఎల్లమ్మకు తిరుపతికి చెందిన కార్పొరేటర్ అన్నా అనిత దంపతులు బంగారు కాసుల హారం విరాళంగా సమర్పించారు. ఎల్లమ్మ జాతర మంగళవారం ఉదయం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి అన్నాఅనిత సారె తీసుకువచ్చి సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దయతో అంతా మంచిజరగాలని వేడుకున్నారు. అనంతరం భక్తులకు అంబలి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుడి నిర్వాహకులు తిరుమలశెట్టి శ్రీనివాసులు, కటారిమోహన్, పూజారి చిలకమ్మ,శ్రీను,బాలకృష్ణస్వామి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నెలాఖరులో సిఎం చంద్రబాబు కుప్పం పర్యటన

కుప్పం, ఆగస్టు 19 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు ఆగస్టు నెలాఖరులో తన సొంత నియోజకవర్గం కుప ్పంలో పర్యటి ంచనున ్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ పర్యటనలో భాగంగా కుప్పం ప్రాంత ప్రజలు, రైతులు ఎదురుచూస్తున్న హంద్రీ-నీవా కాలువల ద్వారా కృష్ణా జలాలను కుప్పం ప్రజలకు అంకితం చేయనున్నారు. కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా కృష్ణా జలాలు ఈనెలాఖరుకు కుప్పం చేరుకోనున్నాయని అధికారులు పేర్కొంటు న్నారు. దీంతో సిఎం పర్యటనను ప్రజాప్రతినిధులు ఖరారు చేస్తున్నట్లు సమాచారం. కాగా ఈనెల29,30,31 లేదా ఆగస్టు 30,31, సెప్టెంబర్ 1న మూడు రోజుల పాటు సిఎం చంద్రబాబు కుప్పంలో పర్యటిస్తారని సమాచారం.

## ఏరియా ఆసుపత్రిలో పోలీసు ఆవుట్ పోస్టు



శ్రీకాళహస్తి,ఆగస్టు 19 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో సిబ్బంది,రోగుల భద్రత దృష్ట్యా రాత్రి వేళల్లో పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేస్తూ పోలీసులు నిర్ణయం తీసుకున్నారు. ఇక్కడ ఆసుపత్రిలో రాత్రి వేళల్లో ఆకతాయిల ఆగడాలు పెచ్చుపెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన ఆసుపత్రి అభివృద్ధి మండలి సమావేశంలో చైర్మెన్ మరియు స్థానిక శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి పోలీసులు ఇక్కడ ఓ అవుట్ పోస్టును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దానికి స్పందించిన డివైయస్‌పి నరసింహామూర్తి, టూటౌన్ సిఐ నాగార్జున్‌రెడ్డిలు కసరత్తు చేసి ఆసుపత్రి ఆవరణలో అవుట్ పోస్టును ఏర్పాటు చేసారు. ఈ మేరకు డివైయస్‌పి నరసింహామూర్తి మాట్లాడుతూ గతంలో జరిగిన సంఘటనల దృష్ట్యా ఇక్కడ రాత్రి వేళల్లో భద్రత దృష్ట్యా ప్రవేశ ద్వారం వద్ద ఓ కానిస్టేబుల్‌ను నియమించినట్లు వివరించారు. ప్రత్యేక గదితోపాటు ఇక్కడ రిజిస్టర్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. రాత్రి వేళల్లో ఆసుపత్రి ఆవరణలోకి ఎవ్వరూ రాకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. ఎవరు శాంతిభద్రతలకు విఘాతం కల్పించుటకు ప్రయత్నించినా ఉపేక్షించేది లేదన్నారు.

## పేదలకు ఆస్తి హక్కు పత్రాలు



కోట, ఆగస్టు 19 ప్రభాతవార్త: మండలంలోని కేశవరం గ్రామంలో పేద ప్రజలకు ఆస్తి హక్కు పత్రాలపై ఎంపిడిఓ ఏకొల్ల వేణు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామిత మిత్ర పథకంలో పేదలను సంపన్నులుగా చేయాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం పంచాయతీల్లో సర్వే నిర్వహిస్తుందని చెప్పారు. ప్రజల ఆస్తులు, ఇళ్ల స్థలాలు అన్నింటిపై పారదర్శకంగా సర్వే పూర్తయినప్పుడు ప్రజలకు ఆస్తి హక్కు పత్రాలు పంపిణీ చేస్తామన్నారు. ఆస్తి హక్కు పత్రాలను ప్రజలు తమ జీవనోపాధి కోసం బ్యాంకుల్లో పెట్టి రుణాలు తీసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

## 21న బాలాయపల్లిలో పింక్ బస్ క్యాంపు



బాలాయపల్లి, ఆగస్టు 19 ప్రభాతవార్త : టీటీడీకి చెందిన తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో ఈనెల 21న గురువారం బాలాయపల్లిలో పింక్ బస్ క్యాంపు జరుగనుందని వైద్యాధికారి డాక్టర్ లియోన తెలిపారు. పరిసర ప్రాంతాల ప్రజలు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్విమ్స్ డైరెక్టర్ కమ్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటి మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాలు, మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతున్నాయి. బిపి, షుగరు పరీక్షలతో పాటు పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తారు. ఈ క్యాంపునకు వచ్చేవారు తప్పనిసరిగా ఆధార్ కార్డు, ఫోన్ నంబరు తీసుకొని రావాలనికోరారు.

## 21న జరిగే బ్లాక్ డే జయప్రదం చేయండి



బాలాయపల్లి, ఆగస్టు 19 ప్రభాతవార్త: డిమాండ్ల సాధనకు ఈనెల 21వ తేదీ మండల కేంద్రాల్లో అంగన్వాడి వర్కర్స్ ఆందోళన చేస్తున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. మంగళవారం ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆల్ ఇండియా కమిటీ పిలుపుమేరకు వెంకటగిరి ప్రాజెక్ట్ కమిటీ ఆధ్వర్యంలో ఐసిడిఎస్ వెంకటగిరి ప్రాజెక్ట్ సిడిపిఓకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు వెంకటగిరి ప్రాజెక్ట్ అధ్యక్షురాలు ఏ మంజుల మాట్లాడుతూ అంగన్వాడి యూనియన్ ఆల్ ఇండియా కమిటీ పిలుపుమేరకు అన్ని మండల కేంద్రాల్లో ఈనెల 21 వ, తేదీ నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఎఫ్ ఆర్ ఎస్ రద్దు కోసం వేతనాల పెంపు కోసం మినీ సెంటర్స్‌ను మెయిన్ సెంటర్స్‌గా మారుస్తూ జీవో వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుభాషిని నిర్మల, సుమతి, సుహాసిని తదితరులు పాల్గొనడం జరిగింది.

## అంగవైకల్యం తక్కువ ఉన్న వారికి నోటీసులు

బాలాయపల్లి, ఆగస్టు 19 ప్రభాతవార్త: మండలంలో 40 కన్నా వైకల్యం తక్కువ 200 మంది వికలాంగ పెన్షన్ దారులకు నోటీసులను ఎంపిడిఓ డి.జ. వినీల్ కుమార్ జారీ చేశారు. నోటీసులు అందినవారు ఆందోళన చెందవద్దు. నోటీసులు అందినవారు తగిన ధృవపత్రాలతో ఎంపిడిఓ కార్యాలయంలో హాజరై పెన్షన్లను క్రమబద్ధీకరించుకోవచ్చని తెలిపారు. 40 శాతం కన్నా వైకల్యం ఎక్కువ ఉన్న వారికి పెన్షన్లు యధావిధిగా అందుతాయని వివరించారు.

## రీ సర్వేపై గ్రామ సభ



వాకాడు, ఆగస్టు 19 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వేలో ప్రాజెక్టులో భాగంగా తిరుపతి జిల్లాలో ఫస్ట్ ఫేస్ నుండి వాకాడు మండలం గంగనపాలెం గ్రామం నందు గ్రామసభ మంగళవారం నిర్వహించారు. ఈ గ్రామ సభ ముఖ్య ఉద్దేశం రీ సర్వే పూర్తయినందున జాయింట్ కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ ప్రకారం డిఎల్ఆర్ కంప్యూటర్ నందన ఆర్ఓఆర్ ఫైనల్ పబ్లికేషన్ గ్రామస్తులకు చదివి వినిపిచ్చి ఏదైనా అభ్యంతరం ఉంటే 15 దినములు లోపల అభ్యంతరం కార్యాలయం తెలియజేయవలసిందిగా తెలుపుతూ పబ్లికేషన్ లిస్టును గ్రామ సచివాలయం నందు పబ్లికేషన్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ తాసిల్దార్ రఫీ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్ యాదవ్, మండల సర్వేయర్ శకుంతల, వీఆర్వో, వీఆర్ఏలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ నాగేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మన్‌గా ఆదినారాయణరెడ్డి



సూళ్లూరుపేట, ఆగస్టు 19 ప్రభాతవార్త : పట్టణంలోని శ్రీ నాగేశ్వరస్వామి దేవస్థానానికి నూతన పాలక మండలిని నియమిస్తూ రాష్ట్ర దేవాదాయశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దేవస్థానం ఛైర్మన్‌గా బిజెపికి చెందిన తాటిపర్తి ఆదినారాయణరెడ్డిని నియమించారు. సభ్యులుగా పట్టుపల్లి మోహన్, పోలూరు లీలామోహన్, చిట్టేటి మధు, మట్రెడ్డి బేబీ, వెంకట నాగపరిమళ, మాముడూరు శాంతి, సుమతి, ఆనందనాయుడులను నియమించారు. ఈ సభ్యులందరు టిడిపికి చెందిన వారు. ఛైర్మన్‌గా నియమితులైన ఆది నారాయణరెడ్డి బిజెపిలో 1987 నుంచి పనిచేస్తూ చురుకైన కార్యకర్తగా పేరు తెచ్చుకున్నారు. తనకు పదవి రావడంలో కృషి చేసిన మాజీ ఎంఎల్‌సీ వాకాటి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, కూటమి నేతలకు ఆదినారాయణరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ నెల 25వ తేదీన నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఆయన చెప్పారు

## ప్లాస్టిక్‌కవర్ల దుకాణాలపై దాడులు

నాయుడుపేట, ఆగస్టు 19 ప్రభాతవార్త : నాయుడుపేట పట్టణంలోని ప్లాస్టిక్ కవర్లు అమ్మకాలు చేపడుతున్న దుకాణాలపై మున్సిపాల్టి కమిషనర్ పజులుల్లా ఆధ్వర్యంలో అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. పట్టణంలోని బజారువీధుల్లో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న,అమ్మకాలు చేపడుతున్న దుకాణాలపై మున్సిపాల్టి అధికారులు దాడులు నిర్వహించి, ప్లాస్టిక్ కవర్లును స్వాధీనం చేసుకొన్నారు. ఈ సందర్భంగా మున్సిపాల్టీ కమిషనర్ మాట్లడుతూ నాయుడుపేట పట్టణంలో దుకాణాదారులు ఎవరైన ప్లాస్టిక్ కవర్లు వినియోగించిన, అమ్మకాలు చేపట్టిన అటువంటి వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

# చెరువులో జరిగిన ఉపాధిపనులపై బహిరంగ విచారణ



తిరుపతిరూరల్,ఆగస్టు19ప్రభాతవార్త: తిరుపతి రూరల్ మండలం పేరూరు గ్రామ పంచాయతీలోని చెఱువులో జరిగిన ఉపాధి హామీ పనులపై బహిరంగంగా సమగ్ర విచారణ చేపట్టాలని తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడు మూలం చంద్రమోహన్‌రెడ్డి డిమాండ్ చేసారు. పేరూరు చెఱువులో నీళ్ళు ఉన్నాయని, నాలుగు గ్రామ పంచాయతీలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్స్ పేరూరు చెఱువులో రూ.1.5కోట్ల రుపాయాల ఉపాధి పనులు జరిగినట్లు తప్పుడు రికార్డు చేసిన పత్రాలు తన దగ్గర ఉన్నాయని, పేరూరు చెఱువులో జరిగిన ఉపాధి పనులపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. అలాగే దుర్గసముద్రంలో కూడా ఉపాధికూలీలలో తేడా ఉందని, ఉపాధి పనులకు రాకుండా బిల్లు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయని, ఆ విషయంపై కూడా విచారణ జరపాలని చంద్రమోహన్‌రెడ్డి కోరారు. పెరుమాళ్ళపల్లిలో జరిగిన ఉపాధి పనులలో జరిగిన అవకతవకలపై కూడా విచారణ ఉంటుందని డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. పేరూరు చెఱువులో జరిగిన ఉపాధిహామీ పనులు, పెరుమాళ్ళపల్లిలో ఉపాధి పనుల్లో మస్టర్స్ అవకతవకలపై ఎఆర్‌బి నుంచి సోషల్ ఆడిట్ ఉంటుందని, ఎపిడి, ఎంపిడిఓ, ఏపిఓ విచారణ కమిటీలో ఉంటారని, పూర్తిస్థాయిలో విచారణ జరిపి, సమగ్ర నివేదికను అందిస్తారని తెలిపారు. మంగళవారం తిరుపతిరూరల్ మండలం ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో మహాత్మ గాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై 19వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఉపాధిహామీ పనులపై జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదిక, బహిరంగ ఆడిట్‌లో జడ్పిటిసి రత్నమ్మ, ఏపిడి రెడ్డెప్ప, డిఆర్‌డిఎ పిఓ ప్రభావతి, ఎస్టీమ్ లోకేష్, ఎస్ఆర్‌పి లోకేష్, తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వరరెడ్డిలు పాల్గొన్నారు.

## కూటమికి కంచి రాముపై చర్యలు తీసుకునే దమ్ముందా!

తిరుపతి హెల్త్, ఆగస్టు 19 ప్రభాతవార్త : భూ కబ్జాదారుడు కంచి రాముపై చర్యలు తీసుకునే దమ్ము కూటమి ప్రభుత్వానికి ఉందా అని ఆస్ట్రేలియాకు చెందిన ఎన్ఆర్ఐ బాధితురాలు డాక్టర్ సునిత కూటమి ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించింది. ఈ మేరకు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితురాలు డాకర్ సునిత మాట్లాడారు. తిరుపతి అర్బన్ మండలం కైకాల చెరువు గ్రామ లెక్క దాఖల సర్వే నెంబర్ 1లోని 3.36 సెంట్ల భూమిలోని 26 ప్లాట్‌లలో తాము ఏడు ప్లాట్లు కొన్నామన్నారు. అయితే బాలాజీ టింబర్ డిపో అధినేత, భూ కబ్జాదారుడు ఆ భూమినంతా ఆక్రమించి గత ప్రభుత్వ హయాంలో మేము అందరూ కొన్న 26 ప్లాట్ల చుట్టూ ప్రహరిగోడ కట్టి షెడ్లు నిర్మించడం జరిగిందన్నారు. పలు పర్యాయాలు పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని, సాక్షాత్తూ జేసీనే స్వయంగా వచ్చి తమ ప్లాట్లు తమకు సొంతమని చెప్పడంతో ఆ ప్రభుత్వం అతన్ని బదిలీ చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆమె వెంట బాధితులు ఖాజీబీ షాబ్, నసీనా పాల్గొన్నారు.

## కాణిపాకం బ్రహోత్సవాలకు రాష్ట్రప చీఫ్ సెక్రటరీకు ఆహ్వానం



కాణిపాకం, ఆగస్టు 19 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకసా ్వమి వారి దేవస్థానంలో జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను ఆహ్వానిస్తూ మంగళవారం దేవస్థానం తరపున ఆహ్వానపత్రాలను అందజేశారు. దేవస్థానంలో ఈనెల 27 నుండి సెప్టెంబర్ 16 వరకు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు 21 రోజుల పాటు జరుగనున్నాయి. అమరావతిలోని సచివాలయంలో పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, దేవాదాయశాఖ కమీషనర్ రామచంద్రమోహన్, కాణిపాకం ఆలయ ఏఈఓ ధనుంజయ, స్థానిక టీడీపీ నాయకులతో ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను కలసి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికలను అందజేశారు. అనంతరం దేవస్థానం తరపున అర్చకులు, వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటాన్ని, శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, టీడీపీ ఐరాల మండల అధ్యక్షుడు హరిబాబునాయుడు, జడ్పీటీసీ సుచిత్ర, నాయకులు గిరధర్‌బాబు, నాయకులు హేమాద్రినాయుడు, నరసింహులునాయుడులతో పాటు ఆలయ అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

## సింహ వాహనంపై ఊరేగుతున్న గ్రామదేవత ఆరేటమ్మ

పుత్తూరు రూరల్, ఆగస్టు 19 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని కార్వేటి నగరం రోడ్డులో వెలసిన గ్రామదేవత శ్రీ ఆరేటమ్మసింహ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించారు. ఉదయం 5 గంటల నుంచి 11 గంటల వరకు భక్తుల స్వహస్తాలతో అమ్మవారికి పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారికి విశేష అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు చేశారు. రాత్రి మండపంలో ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. పాలాభిషేకం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు.

**గ్రామదేవత ఆరేటమ్మకు పట్టు వస్త్రాలు సమర్పణ:**

గ్రామదేవత ఆరేటమ్మ జాతర సందర్భంగా పుత్తూరు పట్టణంలో వెలసిన శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజు స్వామి దేవస్థానం వారు మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా వెళ్లే గ్రామదేవత ఆరేటమ్మకు పసుపు కుంకుమ పుష్పమాల పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.



**ఆరేటమ్మకు మాజీ మంత్రిచే పాలాభిషేకం**



పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని గ్రామదేవత శ్రీ ఆరేటమ్మ ఆలయంలో మంగళవారం పాలాభిషేకం వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పాలాభిషేకం చేసి పట్టు వస్త్రాలతోను, పుష్పాలతోను,ఆభరణాలతోను అలంకరించగా అలంకరణలు భక్తులను అమితంగా ఆకట్టుకుంది. మాజీ మంత్రి రోజా ఈ వేడుకల్లో పాల్గొని అమ్మ వారికి పాలాభిషేకం చేశారు. ఆలయ నిర్వాహకులు ఆమెకు సాదర స్వాగతం పలుకగా భక్తిశ్రద్ధలతో పూజల్లో ఆమె పాల్గొన్నారు. ఆలయ అర్చకురాలు ప్రతిభ ప్రసాదాలు అందించారు. ఆమె వెంట ఆలయ నిర్వాహకులు, వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

## పదినెలల పిల్లాడితో సహా తల్లి అదృశ్యం!



కుప్పం, ఆగస్టు 19ప్రభాతవార్త : మండలంలోని జరుగు గ్రామంకు చెందిన చంద్రలేఖ (28) అనే మహిళ తన పది నెలల కుమారుడితో సహా అదృశ్య మైనట్లు ఫిర్యాదు అందిందని కుప్పం అర్బన్ సిఐ శంకరయ్య తెలిపారు. గత మూడు రోజులుగా ఆమె కన్పించడం లేదన్నారు. తన కుమారుడ్ని తీసుకుని ఇంటినుంచి వెళ్లిపోయిందన్నారు. చ ంద్రలేఖ, పిల్లవాడి గురించి ఏదైనా సమాచారం తెలిస్తే కుప్పం అర్బన్ సిఐ 9440900733,ఎస్సై 8074927671, 9000390519 నెంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.